సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com
ఉమ్మడి వరంగల్
హన్మకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు
శనివారం | 15 | జూన్ | 2024 | పేజీలు : 10




## పార్టీ మారే ప్రసక్తే లేదు: మాజీమంత్రి ఎర్రబెల్లి



జనగామ జూన్14మేజర్ న్యూస్ సూర్య: సోషల్ మీడియాలో తన పై వస్తున్నటు వంటి పార్టీ మార్పు ప్రచారాలను జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్రంగా ఖండించారు .శుక్రవారం ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాను వేదికగా చేసుకుని కొంతమం ది తనపై అసత్య ప్రచారాలను చేస్తున్నా రని,తాను భవిష్యత్తు రాజకీయాల్లో ఎలాం టి పార్టీ మారే ప్రసక్తే లేదని,అవసరమైతే రాజకీయాలకు దూరంగా ఉంటాను కానీ పార్టీ మారే ఆలోచన లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

# లోపమెక్కడ...!

ఓటమి కారణాలపై బీజేపి ఆరా

ఎంపి, ఎమ్మెల్సీ ఫలితాలపై అధిష్టానం విస్మయం

గెలిచే స్థానాలను చేజార్చుకున్నారంటూ కార్యకర్తలు గరం గరం

ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీస్థానాలలో వరుసగా ఓటమిపై కేడర్ అంతర్మథనం

నివేదికలు తెప్పించుకుంటున్న అధిష్టానం

ఉమ్మడి జిల్లాలో వికసించని కమలం

హనుమకొండ సూర్య ప్రతినిధి, జూన్ 14, మేజర్ న్యూస్: వరంగల్, మానుకోట ఎంపి స్థానాలతో పాటు ఎమ్మెల్సీ స్థానం వరుసగా బిజేపి కోల్పోవడం పై బిజేపి అధిష్టానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ నేతలు పేర్కొంటు న్నారు. వరంగల్ స్థానంపై ముందు నుంచి ధీమాతో ఉన్న ఆ పార్టీకి ఓటమి చెందడం పై ఆరా తీస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వరంగల్‌ను తన ఖాతా లో వేసుకున్న బిజేపి జాతీయ నాయకత్వం వరంగల్‌లో బిజేపి రెండవ స్థానానికి పరిమితమవడం అక్కడి నాయకత్వ లోపమే కారణమనే అభిప్రాయం బిజేపి అధిష్టానం భావిస్తుంది మిగతా 2లో..





## ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సిసిఎల్‌ఏ కమీషనర్ నవీన్ మిట్టల్

4 లో





## ఘోర రోడ్డు ప్రమాదం లారీ బోల్తా పడి ఇద్దరు మృతి

5 లో

## వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా సుష్మిత, ప్రొటెక్షన్ టీం సభ్యులుగా పని చేసిన దూల

ఒక్కొక్కరి మీద 4 లక్షల రూపాయల రివార్డు

వరంగల్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి

5 లో



# సామాన్యులపై కూర(గాయ)ల ధరల భారం



మహబూబాబాద్, రూరల్, జూన్ 14,మేజర్ న్యూస్ (సూర్య): కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ధరల మంటకు సామాన్యుల కళ్లల్లో నీరు తిరుగుతుంది. అమాంతం పెరిగిన నిత్యావసర వస్తువులను ధరలను చూసి సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఇటీవలి కురిసిన అకాల వర్షాల వల్లే కూరగాయల ధలకు రెక్కలు వచ్చాయని రైతులు, విక్రయదారులు పేర్కొంటున్నారు. కూరగాయలు, ఇతర వంట సరుకుల ధరలు సామాన్యుని వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. ఏం కొనేటట్టు లేదు...ఏం తినేటట్టు లేదు అన్న పరిస్థితి నెలకొంది. వారం రోజుల్లోనే రిటైల్ మార్కెట్లో కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కొన్నింటి ధరలు మూడు, నాలుగు రెట్లు కూడా పెరిగాయి. భారీగా పెరిగిన కూరగాయల ధరలు వారం క్రితం వరకూ కిలో టమాటా రూ.20 ఉండగా, ప్రస్తుతం అది మూడింతలు పెరిగి రూ.60కు చేరింది. పచ్చిమిర్చిని ముట్టుకుంటే ధర ఘాటు పుట్టిస్తోంది. వారం రోజుల క్రితం కిలో పచ్చిమిర్చి రూ.60 ఉండగా, ప్రస్తుతం అది రూ.100కు చేరింది. కేజీ ఉల్లి ధర గత వారం రూ.22 ఉండగా, ప్రస్తుతం అది రూ.50కి చేరింది. కేజీ చిక్కుళ్లు ధర గత వారం రూ.40 ఉండగా, ఇప్పుడది రూ.120కి చేరింది. క్యాప్సికమ్ కేజీ రూ.60 నుంచి రూ.100కు పెరిగింది. బీరకాయ ధర గత వారంలో కేజీ రూ.60 ఉండగా, ప్రస్తుతం రూ.100కి చేరింది.

### ఆకుకూరల ధరలు ఆకాశానికి

కాయగూర ధరలే కాకుండా ఆకుకూరల ధరలు కూడా ఆకాశాన్ని అంటాయి. అన్ని రకాల ఆకు కూరలు రూ.20కు మూడు కట్టలు ఇచ్చేవారు. ప్రస్తుతం రెండు కట్టలే ఇస్తున్నారు. కొత్తిమీర రూ.10కి దొరికేది, ఇప్పుడది రూ.40కి చేరింది. అల్లం ధర సామాన్యునికి అందనంత ఎత్తుకు పోయింది. పది రోజుల క్రితమే కేజీ అల్లం రూ.80 ఉండగా, ఇప్పుడది రూ.280కి చేరింది. దీంతో అల్లం కొనడానికి సామాన్యులు వెనకడుగు వేస్తున్నారు. అయితే కాయగూర, ఆకుకూరల ధరలు పెరగడానికి అకాల వర్షాలే కారణమని చెబుతున్నారు. అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లిందని, అందువల్ల కూరగాయలు, ఆకుకూరల పంటలు దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు. దీనివల్ల పంట చేతికి రాక, మార్కెట్లోకి వెళ్లక ధరలు పెరిగాయని చెబుతున్నారు. విక్రయదారులు కూడా అకాల వర్షాలనే ధరలు పెరగడానికి కారణంగా చెబుతున్నారు.

### నాన్ వెజ్ ధరలు పైపైకి

అలాగే చికెన్, మటన్, గుడ్లు ధరలు కూడా భారీగా పెరిగాయి. కిలో చికెన్ రూ. 250 పలుకుతుంది. ముప్పై గుడ్ల ట్రే రూ.170 నుంచి రూ.190 పలుకుతుంది. అలాగే మటన్, చేపలు, రొయ్యల వంటి ధరలు కూడా భారీగా పెరిగాయి. మటన్ కేజీ రూ.1,000కు చేరింది. కిరాణా సరుకుల ధరలు కూడా భారీగా పెరిగాయి. దీంతో ఈ ధరలు సామాన్యుడికి ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. నెల రోజుల క్రితం వంద గ్రాముల జీలకర్ర ధర రూ.40 ఉండగా, ఇప్పుడు అది రూ.80 చేరింది. వెల్లుల్లి కేజీ రూ.90 ఉండగా, అది ప్రస్తుతం రూ.150కి చేరింది. పప్పులు ధరలు కూడా కేజీ దగ్గర రూ.30 నుంచి రూ.40 వరకు పెరిగాయి





## పాఠశాలలను సందర్శించిన అడిషనల్ కలెక్టర్- రాధిక గుప్తా



భీమదేవరపల్లి జూన్ 14 మేజర్ న్యూస్ : భీమదేవరపల్లి మండలంలోని పాఠశాలలను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా శుక్రవారం నాడు సందర్శించారు.ముల్కనూర్ లోని ఎస్సీ కాలనీలో గల ప్రాథమిక పాఠశాలలో స్కూల్ పరిసర ప్రాంతాలను పాఠశాల భవన పరిస్థితిని తెలుసుకున్నారు పిల్లల హాజరు శాతం మరియు వారికి కావలసిన మంచినీటి సౌకర్యం బాత్రూంలు పర్యవేక్షించారు విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించారు.తదనంతరం అంగన్వాడీ కేంద్రం ను సందర్శించి బిల్డింగ్ పరిస్థితి మరియు విద్యుత్ సదుపాయం లేకపోవడంతో స్థానిక కార్యదర్శి పూర్ణచందర్ తో విద్యుత్తు అందించాలని కోరారు.మంచినీటి కొరకై ప్రత్యేకంగా కుండను కూడా అమర్చాలని అడిషనల్ కలెక్టర్ కలెక్టర్ రాధిక గుప్తా పేర్కొన్నారు. ముల్కనూర్ లోని మోడల్ స్కూల్ ను సందర్శించి అక్కడ పూర్తిగా ధ్వంసమైన ఫ్లోరింగ్ ను బాగు చేయాలని ల్యాబ్ లో ఉండే విద్యుత్తు పునరుద్ధరించాలని క్లాస్ రూమ్ ల సంబంధించి డోర్లను బాగు చేయాలని వంటశాలకు ప్రత్యేకించి గదిని నిర్మించాలని దానికి సంబంధించిన డేటాను అందించాలని డి ఈ శంకరయ్య ప్రిన్సిపాల్ కుమారస్వామికి సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం ఎంఈఓ వెంకటేశ్వర్లు ఏపీవో కుమారస్వామి ముల్కనూర్ గ్రామ కార్యదర్శి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నదానం.. మహాదానం

### కాంగ్రెస్ యువ నాయకులు తూనం శ్రావణ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా

తొర్రూరు.జూన్.14.మేజర్ న్యూస్ (సూర్య): అన్నదానం.. మహాదానమని తూనం శ్రవణ్ కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు తూనం శ్రావణ్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన మిత్రులు చకిలేల. మణిరాజ్, ఆమంచి దయాకర్ ల ఆధ్వర్యంలో శుక్రవారం సిరి హాస్పిటల్ ఎదురుగా రవి టెంట్ హౌస్ ముందు కేక్ కట్ చేసి,మహా, అన్నదానం, వందేమాతరం, ఫౌండేషన్‌లో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేసి మహా అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ పుట్టినరోజు ప్రతి ఒక్కరికి ప్రత్యేకమని సేవా కార్యక్రమాలు నిర్వహించి పుట్టిన రోజు ప్రత్యేకతను,చాటుకోవాలన్నారు.ఆకలితో ఉన్నవారికి అన్నదానం చేయడం,మానవత్వం,దైవత్వమని తెలిపారు. ఈ సందర్భంగా, అన్నదానం చేపట్టిన మిత్రులను అభినందించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చెరుకుపల్లి సురేష్, కొయ్యాడ. సాంబశివ,తాళ్లపల్లి. బిక్షం గౌడ్,బిజ్జాల వరప్రసాద్, కిరణ్, యాదగిరి నాయక్, రాయి పెళ్లి రాజు,అరుణ్ కుమార్, గంధం. తిరుపతి, రాంబాబు,చంటి, క్రాంతి, మధు,సురేష్,మూల మహేష్,నిఖిల్, అఖిల్, సాగర్, మోటు,ముఖేష్ తదితరులు, పాల్గొన్నారు.



## సోషల్ మీడియా వార్తలను నమ్మకండి

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పార్టీ మారడం లేదు

### మహబూబాబాద్ జెడ్పి ఫ్లోర్ లీడర్, తొర్రూర్ జెడ్ పి టి సి. మంగళపల్లి శ్రీనివాస్



తొర్రూర్ జూన్ 14 మేజర్ న్యూస్ (సూర్య) : తొర్రూరులో జడ్పీ ఫ్లోర్ లీడర్ జెడ్పిటిసి మంగ ళపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ గత రెండు రోజులుగా సోషల్ మీడియా వేదికగా మాజీ. మంత్రి భారత రాష్ట్ర సమితి నాయకులు ఎర్ర బెల్లి. దయాకరరావు పార్టీ మారు తున్నాడనీ. కాంగ్రెస్ పార్టీలో చేరుకున్నట్లు కొందరు దుష్ప్ర చారం చేస్తున్నారు. ఆ వార్తలు బి.ఆర్.ఎస్ .పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ఎన్నికలకు ముం దు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి లేని పక్షంలో హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాటం చేస్తాం తప్పితే స్వార్థపూరిత రాజకీయాల కోసం పార్టీ మారాల్సిన అవసరం దయాకర్ రావు గారికి లేదు. ప్రజలు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల మీద తరపున నిలబడి పోరాటం చేస్తా.తప్పుడు వాగ్దానాలతో అధికారులకు వచ్చిన కాంగ్రెస్ నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తా. ప్రజా సమస్యల పరిష్కారం కోసం దయాకర్ రావు ముందుండి కొట్లాడుతారు అపారమైన అనుభవం ఉన్న నాయకుడిగా అనేక పదవులను పొందారు ఈ వయసులో పార్టీలు మారి అధికార దాహం కోసం వెంపర్ లాడే నాయకుడు కాదు .ఇలాంటి దుష్ప్రచారాన్ని బి.ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఈ తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని కోరుతున్నాం.

### పెద్ద వంగర మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన

## కళ్యాణ లక్ష్మి చెక్కులు విడుదల

పెద్ద వంగర జూన్ 14సూర్య మేజర్ న్యూస్: కళ్యాణ లక్ష్మి చెక్కులు 31 చెక్కులు వచ్చినవి పెద్ద వంగర మండలానికి ఐదు చెక్కులు గంట్లకుంట నాలుగు చెక్కులు అవుతాపురం 8 చెక్కులు కొరిపల్లి ఒక చెక్కు వడ్డే కొత్త పెళ్లి అయిదు చెక్కులు బొమ్మకల్లు ఒకటి చిట్యాల 1 పోచంపల్లి 5 మొత్తం మండలంలోని అన్ని గ్రామాలకు గాను 31 చెక్కులు అందుబాటులో ఉన్నవి గత ఆరు నెలల క్రింద అప్లై చేసుకున్న కళ్యాణ లక్ష్మికి చేసుకున్న వారు పెద్ద వంగర మండలంలోని తాసిల్దార్ ఆఫీస్ లో కళ్యాణ లక్ష్మి చెక్కులు అందుబాటులో ఉన్నాయి కావున రేపు తహసిల్దారు ఆఫీస్ లో కళ్యాణ లక్ష్మి చెక్కుల ను అమ్మాయి తల్లి తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకు రాగలరు అని ఆర్ ఐ ఒక ప్రకటనలో తెలిపారు

# ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్**

**ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులు పరిష్కరించాలి.**

**జిల్లాలో ఉన్న భూముల మార్కెట్ విలువ రిపోర్ట్ సమర్పించాలి**

**అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీసీఎల్ఏ కమీషనర్**



ములుగు, సూర్య ప్రతినిధి జూన్ 14 (మేజర్ న్యూస్): ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి , అదనపు కలెక్టర్ రెవెన్యూ సి.హెచ్. మహేందర్ జి , ఆర్డీవో కే సత్యపాల్ రెడ్డి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమీషనర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసిల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించాలని అన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. ధరణి వెబ్ సైట్ కు సంబంధించి జిఎల్ ఎం, టిఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసిల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారిస్థాయిలో, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత దరఖాస్తులను ఆయా జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సిసిఎల్ఏ కమీషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎలాంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లకు రిటర్న్ వచ్చిన దరఖాస్తులలో అధికంగా ఆర్.ఎస్.ఆర్ దరఖాస్తులు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు జత చేయని దరఖాస్తులు ఉంటాయని, ఆర్ఎస్ఆర్ దరఖాస్తులలో తప్పుడు ఎంట్రీ జరిగిందా ధ్రువీకరించి, తప్పుడు ఎంట్రీని తొలగించి, ఆర్ఎస్ఆర్ సవరణకు రిపోర్టుతో సహా నివేదికలు పంపాలని కలెక్టర్లకు సీసీఎల్ ఏ కమీషనర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా ఇలా త్రిపాఠి మాట్లాడుతూ అదనపు కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికారి తహసిల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరిస్తామని, పెండింగ్ దరఖాస్తులు సత్వర పరిష్కారానికి జిల్లాలోని మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించి దరఖాస్తుల పరిష్కారం వేగవంతంగా అయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.


మండల తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను స్కానింగ్ చేసేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసుకో వాలని, మండలంలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరిం చేందుకు రోజువారి లక్ష్యాలను కేటాయించుకోవాలని కలెక్టర్ 9 మండలాల తహసీల్దార్లకు సూచించారు. ధరణి దరఖాస్తులను తిరస్కరించిన సందర్భంలో అందుకు స్పష్టమైన కారణాలు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు స్పష్టంగా అప్ లోడ్ చేయాలని, అలా చేయడం వల్ల ప్రజలకు ఎందుకు దరఖాస్తు తిరస్కరించారనేది అర్థమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో తొమ్మిది మండల తహసిల్దారులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



భూపాలపల్లి సూర్య ప్రతినిధి జూన్ 14 మేజర్ న్యూస్:ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీసీఎల్ఏ కమీషనర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసిల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించా లని అన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. ధరణి వెబ్ సైట్ కు సంబంధించి జిఎల్ ఎం, టిఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసిల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారిస్థాయి లో, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర స్థాయిలోప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత దరఖాస్తులను ఆయా జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సిసిఎల్ఏ కమీషనర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ మంగిలాల్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



**భూ పరిపాలన చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్**



హనుమకొండ సూర్య ప్రతినిధి ,జూన్ 14, మేజర్ న్యూస్: ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని భూ పరిపాలన చీఫ్ కమిషనర్ నవీన్ మిట్టల్ అన్నారు. రాష్ట్రంలోని జిల్లాల లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను త్వరగా ఎలాంటి తప్పిదాలు జరగకుండా వాటిని పరిష్కరించాలంటూ శుక్రవారం హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లను ఆదేశించారు. చీఫ్ కమిషనర్ మాట్లాడుతూ భూముల మార్కెట్ ధరలను సవరించడానికి మండలాల పరిధిలో ఆర్డిఓ చైర్మన్ గా తహసీల్దార్లు , ఎంపీడీవోలు , సబ్ రిజిస్టార్లు సభ్యులుగా కమిటీలు ఏర్పాటు చేయాలని, అలాగే పట్టణ ప్రాంతాలలో అదనపు కలెక్టర్లు చైర్మన్ , మున్సిపల్ కమిషనర్లు , తహసిల్దార్లు , జడ్పీ సీ.ఓలు సభ్యులు గా కమిటీల ఏర్పాటు చేయాలని అదేవిధంగా జిల్లా కలెక్టర్ చైర్మన్ గా అనామలీస్ కమిటీ ఏర్పాటు చేయాలని అన్నారు. దీనిలో అదనపు కలెక్టర్లు , ఆర్డీవోలు , తహసిల్దారులు , రిజిస్టార్లు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీలను త్వరగా ఏర్పాటు చేసి భూముల మార్కెట్ ధరలను సవరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ కలెక్టర్ మాట్లాడుతూ వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్ రెడ్డి , డిఆర్ఓ వై.వి గణేష్ , ఆర్డీవోలు పరకాల , వరంగల్ వెస్ట్ నారాయణ , వెంకటేశ్వర్లు మరియు సంబంధిత తహసిల్దార్లు అధికారులు పాల్గొన్నారు

# నిషేధిత గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు

### బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానం నిషేధం

### పొగాకు నియంత్రణకు అవగాహన

### సైన్ బోర్డులను పక్కాగా ఏర్పాటు చేయాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




జనగామ జూన్ 14, మేజర్ న్యూస్ సూర్య: నిషేధిత గుట్కాలు, పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో డీసీపీ సీతారాంతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమం (ఎన్టీసీపీ) కింద జిల్లాస్థాయిలో సమన్వయ కమిటీ (డీఎల్సీసీ) అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని 2007లో తీసుకొచ్చిందని అన్నారు. ప్రాణాంతకమైన పొగాకు ఉత్పత్తుల వాడకం, ధూమపానం నివారణ, విక్రయాల నిషేధం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం, మద్యపానం నిషేధమని తెలిపారు. కిరాణా, పాన్ షాపుల్లో నిషేధిత గుట్కాలు, సిగరెట్లు, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంద మీటర్ల పరిధిలో ప్రతి పాఠశాల వద్ద, ప్రతి గ్రామ పంచాయతీలలో అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేయాలని, ఓరియంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించాలని సూచించారు. ఎన్సీడీ కింద ఒకరిని నియమించాలని, ప్రతి పాఠశాల వద్ద సాయంత్రాలు, రాత్రుళ్ళు పోలీసు పెట్రోలింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ లలో విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించి, అవగాహన కల్పించాలని సూచించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద బాల కార్మికులు లేకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మునిసిపల్ కార్యాలయాలు, ప్రతి పాఠశాలను సందర్శించి, ప్రతి వారం నివేదికను సమర్పించాలని స్పష్టం చేశారు. సెక్షన్ 4 – బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం కింద కేసు నమోదు చేసి, సెక్షన్ 21 కింద రూ. 200 జరిమానా విధించడం జరుగుతుందని, సెక్షన్ 6ఎ – మైనర్లకు, మైనర్లచే పొగాకు ఉత్పత్తుల విక్రయాల కింద కేసు నమోదు చేసి, సెక్షన్ 24 కింద రూ. 200 జరిమానా విధించడం జరుగుతుందని, సెక్షన్ 6బి– వంద మీటర్ల రేడియస్ లో ఏదైనా విద్యాసంస్థ పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాల కింద కేసు నమోదు చేసి, సెక్షన్ 24 కింద రూ. 200 జరిమానా విధించడం జరుగుతుందని, సెక్షన్ 5 – ప్రత్యక్షంగా/పరోక్షంగా నిషేధిత పొగాకు ఉత్పత్తుల ప్రకటనల కింద కేసు నమోదు చేసి, సెక్షన్ 22 కింద రూ. 1000 జరిమానాతో పాటు రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, కొన్ని సందర్భాల్లో రెండూనూ విధించడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టరీత్యా కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం డీసీపీ మాట్లాడుతూ.. బస్టాండ్, రైల్వే స్టేషన్, తదితర బహిరంగ ప్రదేశాల్లో పొగాకు నియంత్రణకు సంబంధించిన నిషేధిత అవగాహన సైన్ బోర్డులను పక్కాగా ఏర్పాటు చేయాలని సూచించారు. జువైనల్ జస్టిస్ యాక్ట్ – సెక్షన్ 77 ప్రకారం పొగాకు ఉత్పత్తుల వాడకం, మైనర్లకు డ్రగ్స్ సరఫరా కింద కేసు నమోదు చేసి, రూ. లక్ష జరిమానాతో పాటు ఏడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎంహెచ్ఓ హరీష్ రాజ్, డీఆర్డీఓ మొగులప్ప, జీఎం ఇండస్ట్రీస్ మేనేజర్ రమేష్, ప్రోగ్రాం అధికారులు డా. సుధీర్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు దంపతులు

### సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా సుష్మిత, ప్రొటెక్షన్ టీం సభ్యులుగా పని చేసిన దూల

### ఒక్కొక్కరి మీద 4 లక్షల రూపాయల రివార్డు

### వరంగల్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి



హనుమకొండ సూర్య ప్రతినిధి, జూన్ 14, మేజర్ న్యూస్: వరంగల్ పోలీస్‌ల ఎదుట మావోయిస్టు దంపతులు శుక్రవారం లొంగి పోయారు. లొంగి పోయినవారిలో ఒకరు సెంట్రల్ కమిటీ స్టాఫ్ గా, మరో కరు ప్రొటెక్షన్ టీం సభ్యులుగా పని చేసినట్లు వరంగల్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. ఇంచార్జ్ సిపి అభిషేక్ మొహంతి వివరాలు వెల్లడిస్తూ తిక్క సుష్మిత్ అలియాస్ చైతే ఏరియా కమిటీ మెంబర్ గా మడకం దూల అలియాస్ దూల ఏరియా కమిటీ వెంబర్ గాపని చేస్తున్నట్లు తెలిపారు. లొంగిపోయిన ఇద్దరు మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఇంచార్జ్ అయిన పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న వద్ద సుష్మిత సెంట్రల్ కమిటీ స్టాఫ్‌గా దూల ప్రొటెక్షన్ టీమ్ సభ్యులుగా పని చేశారని తెలిపారు. హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం సుదంపల్లి గ్రామానికి చెందిన తిక్క సుష్మిత ఇంటర్మీడియేట్ వరకు చదువు కుందని చెప్పారు. తన తండ్రి అయిన తిక్క సుధాకర్ మావోయిస్టు సానుభూతి పరుడుగా పని చేయడం తో తండ్రిని చూసి సుష్మిత చదువును మధ్యలోనే ఆపి వేసి 2016 సంవత్సరంలోఛత్తీస్ గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కోమటిపల్లి గ్రామ అటవీ ప్రాతంలో బడే చొక్కారావు అలియాస్ దామోదర్ సమక్షంలో మావోయిస్టు పార్టీలో చేరినట్లు తెలిపారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుకుమా జిల్లా పరియా గ్రామానికి చెందిన మడకం దూల అలియాస్ దూల ఐదవ తరగతి చదువుకున్నాడని చెప్పారు. తన అన్న అయిన ఐయేత 2008 సిపిఐ మావోయిస్టు పార్టీలో చేరాడని అతన్ని చూసి ఆకర్షితుడైన దూల 2015 సంవత్సరంలో ఏరియా కమిటీ మెంబర్ అయిన జోగి ప్రోత్సాహంతో సిపిఐ మావోయిస్టు పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న సమయంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి 2020 మార్చి నెల 30 వ తేదిన వివాహం చేసుకున్నట్లు సిపి తెలిపారు. తరువాత వివిధ హోదాల్లో పలు చోట్ల పని చేశారని చెప్పారు. మావోయిస్టు సిద్ధాంతా లపై నమ్మకం కోల్పోయి తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస పథకం గురించి తెలుసుకుని ఆకర్షితులైన శుక్రవారం తమ ఎదుట లొంగి పోయినట్లు సిపి తెలిపారు. ఒక్కొక్కరి మీద 4 లక్షల రూపాయల నగదు రివార్డు ఉందని ఆ మొత్తాన్ని బ్యాంక్ డిడి రూపంలో వారికి అందచేసినట్లు వరంగల్ ఇంచార్జ్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు.





### ఘోర రోడ్డు ప్రమాదం

# లారీ బోల్తా పడి ఇద్దరు మృతి

గూడూరు జూన్ 14 మేజర్ న్యూస్ (సూర్య ): మండ ల కేంద్రంలో ప్రధాన రహదా రిపై శుక్రవారం తెల్లవారుజా మున బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులపై మహబూబాబాద్ నుండి నర్సంపేటకు వెళ్తున్న జామా యిల్ కర్రల లారీ ఒక్కసారి గా అదుపుతప్పి బీభత్సం సృష్టించి బస్సు కోసం ఎదురు చేస్తున్న ప్రయాణికుల మీద పడగా అక్కడికక్కడే దనసరి పాపారావు 34 ఇఐ గన్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుంచా దేవేందర్ 38 లు చనిపోయారు బోల్తా పడ్డ లారీని లేపడానికి స్థానిక పోలీసులు బాటసారులు నానా అవస్థలు పడ్డారు వీరు ఇద్దరు కూడా కొద్దిసేపట్లో విధుల్లోకి హాజరయ్యే లోపే ఒక్కసారిగా మృత్యువాత పడడంతో ఒక్కసారిగా మండలం మొత్తం ఒక్కసారిగా శోకసముద్రం అలుముకున్నాయి. మృతదేహాలను వెలికి తీసిన అనంతరం గూడూరు మార్చురి కీ తరలించారు లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉండడం వలనే ప్రమాదం జరిగిందని స్థానికులు భావిస్తున్నారు



## కడియం కావ్య ను మర్యాదపూర్వకంగా కలిసిన పర్వతగిరి యూత్ కాంగ్రెస్ నాయకులు



పర్వతగిరి (జూన్ 14) సూర్య న్యూస్: వరంగల్ పార్లమెంట్ ఎంపీ కడియం కావ్య స్వగృహంలో కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజ యం సాధించందున వారికీ పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపి యూత్ నాయకురాలిగా యూత్ కాంగ్రెస్ నాయకులకు తమ సహాయ సహకారాలు అందించాలని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కందికట్ల అనిల్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి పుల్లూరి దిలీప్ గౌడ్ వారిని కోరారు. వారి వెంట యువజన కాంగ్రెస్ కార్యదర్శి బొక్కల ప్రమోద్, మండల నాయకులు రాజేష్ వంశి తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## 25వ సారి రక్తదానం చేసిన ఐలోని అభిషేక్



గీసుగొండ జూన్ 14 (సూర్య): మండలంలోని ఎలుకుర్తి హవేలీ గ్రామానికి చెందిన సోషల్ సర్వీస్ ఐలోని అభిషేక్ ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రక్త దానం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ 25 సార్లు రక్తదానం చేశానని,రక్తదానం మరొకరికి ప్రాణదానమని,ఎవరికి ఏ ఆపద వచ్చినా బంధువులకు, మిత్రులకు, ఎమ్మెల్యేల పుట్టిన రోజులు,మహానుభావల జయంతికి రక్తదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.రక్తం ఇవ్వడం వల్ల ఫిల్టర్ అవుతూ కొత్త రక్తం తయారవుతుందని,ఆరోగ్యంగా ఉంటారని వారు తెలిపారు.

## పేసా గ్రామ సభలను బలోపేతం చేయాలి

### పేసా కోఆర్డినేటర్ కొమురం ప్రభాకర్



తాడ్వాయి జూన్ 14మేజర్ న్యూస్ సూర్య: పేసా గ్రామ సభలతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేసా కోఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పీసా గ్రామ సభల అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావే శానికి ముఖ్యఅతిథిగా హాజరై 5వ షెడ్యూల్ ఏరియాలో భారత రాజ్యాం గం ప్రకారం పేసా కమిటీలను ఎన్నుకోవడం జరిగిందని ఎన్నికైన గ్రామ సభలను బలోపేతం చేయవలసిన బాధ్యత పేసా కమిటీలదేన న్నారు. తెలంగాణ నూతన పంచాయతీ రాజ్ చట్టం -2018 ప్రకారం ప్రతి రెండు నెలల కొకసారి గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందని ఏజెన్సీ గ్రామాలలో సీజనల్ వ్యాధులు, వరదలపై కమిటీలు పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమం లో ఎంపీఓ శ్రీధర్,పేసా మండల భాద్యులు కొమురం చంద్రయ్య,అల్లెమ్ నవీన్, ఎల్లబోయిన నగేష్,తల్లడి లక్షుమయ్య,స్వామి, రమేష్,చర్ప రవి, సిద్దబోయిన నర్సింగరావు, వట్టం కన్నయ్య,రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బొడ్రాయి 12వ వార్షికోత్సవ వేడుకలు

ఏటూరునాగారం. జూన్ 14 మేజర్ న్యూస్ సూర్య: ఎటూర్ నాగారం మండల కేంద్రంలో బొడ్రాయి 12వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రోజున ఘనంగా జరిగాయి. ఎల్లాప్ర గడ రాధాకృష్ణశర్మ బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించి పంచామృత అభిషేకాలను నిర్వహించారు. భువనేశ్వరి భూలక్ష్మి నాభి శిల బొడ్రాయికి నూతన వస్త్రాలను అలంకరించారు గుమ్మడికాయలు నిమ్మకాయలతో దిష్టి చేసి ధూప దీప నైవేద్యాలను సమర్పించి అర్చనలు చేశారు అనంతరం అనంతరం తీర్థ ప్రసాదాల స్వీకరణ కార్యక్రమం పంపిణీ కార్యక్రమం చేపట్టారు ఈ కార్యక్రమంలో పోగుల లక్ష్మీనారాయణ , కత్తెర శీను జూపాక రాజేష్ మహేందర్ నూతి రమేష్,కుమార్, జయంత్ వేణుగోపాల్ వెన్న సతీష్ సాయిబాబా గుడి అధ్యక్ష కార్యదర్శులు పెండ్యాల ప్రభాకర్, బచ్చు సతీష్ కుమార్, చిందుకూరి వెంకటరావు, ఇర్సవడ్ల బిక్షపతి, మంచర్ల పవన్, మహిళలు పాల్గొన్నారు.

## నిషేధిత గ్లైపోసెట్ గడ్డి మందు పట్టివేత



మరిపెడ,జూన్ 14,మేజర్ న్యూస్(సూర్య):మరిపెడ పట్టణ కేంద్రంలో నిషేధిత గ్లైపోసెట్ గడ్డి మందును స్వాధీనం చేసుకున్నట్లు మరిపెడ వ్యవసాయ అధికారి వీరాసింగ్ పేర్కొ న్నారు. శుక్రవారం టాస్క్ ఫోర్స్ ఎన్ఫోర్స్మెంట్ తనిఖీ లో భాగంగా మరిపెడ మండలంలో సూర్యతేజ ఏజెన్సీస్, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం లో బిల్లు లేకుండా అమ్ముతున్నటువంటి గ్లైపోసెట్ 41% గడ్డి మందు ను 22 లీటర్లు మందును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.దీని విలువ సుమారు10వేల వరకు ఉటుందన్నారు.ఈ తనిఖీల్లో టాస్క్ ఫోర్స్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై ఉమా,ఏ ఈ ఓ శశి కుమార్,పోలీస్ సిబ్బందిఅబ్దుల్,దిలీప్ కుమార్లు ఉన్నారు.

## స్వంత ఖర్చులతో నోట్ పుస్తకాల పంపిణీ

మరిపెడ,జూన్ 14,మేజర్ న్యూస్(సూర్య):మరిపెడ మండల కేంద్రంలోని గాలివారిగూడెం గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి తమ సొంత ఖర్చులతో విద్యార్థులం దరికీ సుమారు 5000 విలువైన నోట్ పుస్తకాలు ,పలకలు, బలపాలు, పెన్నులు,పెన్సిల్లు పంపిణీ చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న తెలిపారు.ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు అందరూ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యసించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపా. ద్యాయులు మురళీధర్ వెంకన్న,ఫైజుద్దీన్,బాలు, లింగాల మహేష్ గౌడ్ అంగన్వాడి టీచర్లు రాములమ్మ, అచ్చమ్మ,అనిత గ్రామస్తులు వెంకన్న,సునీత లాలయ్య పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# రైతుల పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలి

### తెలంగాణ రైతు సంఘంరాష్ట్ర కమిటీ సభ్యులు నల్లపు సుధాకర్




కురవి జూన్ 14, మేజర్ న్యూస్ (సూర్య):రైతుల పంట రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని సిపిఎం మండల సీనియర్ నాయకులు నాయకులు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు నల్లపు సుధాకర్ అన్నారు.శుక్రవారం కురవి మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ ముందు దర్నా చేపట్టారు.ఈ సందర్భంగా నల్లపు సుధాకర్ మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు రెండు లక్షలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఖరీఫ్ సాగు ప్రారంభమవడంతో రైతులకు పెట్టుబడి అవసర నిమిత్తం పాత రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని ఆయన అన్నారు.అనంతరం కురవి యూనియన్ బ్యాంక్ మేనేజర్ లావుడ్యా నరేష్ కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలోరైతు సంఘం మండల నాయకులు కొండ బత్తుల వెంకన్న, కట్ల కృష్ణయ్య, బత్తిని వీరభద్రం, ఇరుగు సత్యం, దివ్యాంగుల సంఘం నాయకులుబత్తిని వెంకన్న, గూగులోతు బిచ్చ నాయక్, చిలకమ్మ, బానోత్ సునీత, లూనావత్ శంకర్, బానోత్ సాల్కి, శిరసాని రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## వాడ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



వెంకటాపురం నూగూరు జూన్ 14 సూర్య మేజర్ న్యూస్: తెలంగాణ సతీష్ గౌడ్ సరిహద్దు ప్రాంతంలో నిన్న జరిగినటువంటి బాంబ్ బ్లాస్ట్ లో తీవ్రంగా గాయపడి కాలు సైతం పోగొట్టుకున్నటువంటి డర్ర సునీతను భద్రాచలంఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకట్రావు డర్రదామోదర్ పరామర్శించి హాస్పిటల్ ఖర్చులు నిమిత్తం వెంకటాపురం మండలంవి ఆర్ కె పురం గ్రామపంచాయతీ పరిధిలోని చొక్కాల గ్రామ ప్రజలు కలిసి వాడ బలిజ సేవా సంఘం తరపున మరియు ఇతరుల సహాయ సహకారాలతో వి ఆర్ కె పురం యూత్ కలిసి కట్టుగా సంఘాలు నిరుపేద కుటుంబమైన డర్ర సునీత కు అక్షరాల 1,20,000 రూపా యలను సునీత భర్త మహేష్ కి ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందిఅనంతరం భద్రా చలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట రావు జాగ్రతి హాస్పిటల్ కి వచ్చి డర్ర సునీత హాస్పి టల్లో పరామర్శించారు ఈ కార్యక్రమంలో తోట నాని, డర్ర రవి, సనగొండ పోతురాజు, డర్ర రాంప్రసాద్, దివాకర్, ప్రశాంత్, వెంకటేష్, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

## నోట్ బుక్స్,పెన్నుల పంపిణీ



కురవి జూన్14, మేజర్ న్యూస్ (సూర్య): పిడిఎస్ యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవెందర్ శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కురవి మండలం లోని పెద్ద తండా, బంచరాయితండ, బంగారి గూడెం, చౌల్ల తండ గ్రామాల ప్రాథమిక పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బానోత్ దేవేందర్ మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా నిరుపేద విద్యార్థులకు ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోట్బుక్స్ పెన్నులు పంపిణీ చేసే కార్యక్రమం చేస్తున్నానని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా పేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో విజయ్ నాయక్, పెద్ద తండా ప్రధానోపాధ్యాయులు సుధాకర్, బంచరాయితండ ప్రధానోపాధ్యాయులు లత, బంగారి గూడెం ప్రధానోపాధ్యాయులు శ్రీ దేవి, చౌల్ల తండ ప్రధానోపాధ్యాయులు కేవై లత, మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్లో అడ్మిషన్స్ ప్రారంభం



ఖానాపూర్ జూన్ 14,మేజర్ సూర్య న్యూస్ : ఖానాపూర్ మండలంలోని తల్లిదండ్రులకు తెలియజేయునది ఏమనగా బుధరావుపేట గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ నందు ఆరవ తరగతి నుండి 12వ తరగతి (ఇంటర్మీడియట్) వరకు అడ్మిషన్లు జరుగుచున్నవి. గత 11 సంవత్సరాలుగా ఖానాపూర్ మండలంలో ప్రతి సంవత్సరము 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ లో అత్యున్నత ఫలితాలు సాధిస్తున్నటువంటి విద్యా సంస్థ తెలంగాణ మోడల్ స్కూల్ బుధరావుపేట. 2023 –24 విద్యా సంవత్సరంలో 92 శాతం ఉత్తీర్ణతతో పాటు, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 17 మంది విద్యార్థులకు 900 పైగా మార్కులు సాధించడం జరిగింది. బిపిసి సెకండియర్ నందు971/1000 మార్కులతో మారిపెద్ది సాయి ప్రియ ప్రథమ స్థానంలో, మరియుఎంపీసీ సెకండియర్ నందు 964/1000 మార్కులతో కందికొండ వర్షిత ,ప్రథమ స్థానంలో నిలవడం జరిగింది.ఫస్ట్ ఇయర్ బీపీసీ లో 430/440 మార్కులతో బి దివ్య , ఫస్టియర్ఎంపీసీ నందు 435/470 మార్కులతో ఎస్ శివ దుర్గ , సిఈసి ఫస్ట్ ఇయర్ లో బి శ్రీవల్లి 466/500 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవడం జరిగింది.ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 14 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించడం జరిగింది. 2023– 24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాలలో 9.5 జిపిఏ లతో ముగ్గురు విద్యార్థులు ఖానాపూర్ మండలంలో టాపర్స్ గా నిలవడం జరిగింది పదవ తరగతి ఫలితాలలో 11 మంది విద్యార్థులు 9 జిపిఏ పైగా సాధించి తమ ప్రతిభను కనబరిచారు ప్రతి సంవత్సరం ఎన్ఎం ఎం ఎస్ , ఈఏపీసెట్ లాంటి పోటీ పరీక్షలలో అనేకమంది విద్యార్థులు ఎంపిక కావడం జరుగుతుంది.2023 ఎన్ఎంఎంఎస్ ఫలితాలలో తెలంగాణ ఆదర్శ పాఠశాల నుండి 8వ తరగతికి చెందిన ఏడుగురు విద్యార్థులు సెలెక్ట్ కావడం జరిగింది. వీరికి 9వ తరగతి నుండి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు సంవత్సరానికి 12000 చొప్పున స్కాలర్షిప్ లభించును. అదేవిధంగా మన పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ అధునాతనమైన గ్రంథాలయము రెండు జతల ఏకరూప దుస్తులు విశాలమైన క్రీడాస్థలం అధునాతనమైనటువంటి ల్యాబ్స్ డిజిటల్ క్లాస్ రూమ్ లద్వారా విద్యాబోధన మరియు ఉచిత బస్సు సౌకర్యం లాంటి సదుపాయాలు గలవు. కావున ఇట్టి అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లలను తెలంగాణ ఆదర్శ పాఠశాల మరియు జూనియర్ కళాశాల బుధరావుపేట యందు చేర్పించగలరని ఒక ప్రకటనలో తెలంగాణ మోడల్ స్కూల్ బుధరావుపేట ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందం తెలియజేశారు.

## తల్లికి తలకొరివి పెట్టిన మతి స్థిమిమితం లేని కుమారుడు



చెన్నారావుపేట జూన్ 14 (సూర్య మేజర్ న్యూస్): కన్న తల్లికి మతిస్థిమితం లేని కుమారుడు తలకొరివి పట్టిన సంఘటన మండలం లోని జల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇదే గ్రామానికి చెందిన కాట ఎల్లమ్మ(65) అన్నారోగ్యంతో మృతి చెందింది. మృతురాలికి నలుగురు కూతుళ్లు, ఒక మతిస్థిమితం లేని కుమారుడు ఐలయ్య ఉన్నారు. తల్లి మృతి చెందడంతో మతి స్థిమితం లేని కుమారుడు తలకొరివి పట్టాడు. ఈ సంఘటనను చూసిన ప్రతి ఒక్కరు కంటతడి పెట్టారు. మృతురాలి కుటుంబాన్ని మాజీ ఎంపీపీ జక్క అశోక్ పరామ ర్శించి రూ.2500ను ఆర్థిక సహాయంగా అందజేశారు. మృతురాలి కుటుం బాన్ని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి అన్ని విధాలుగా ఆదుకో వాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఆర్ సి జిల్లా ప్రధాన కార్య దర్శి సంగం రమేష్, మేరుగు బాబు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు యట సుధాకర్, పెద్ద మనిషి కాట కుమారస్వామి, సొసైటీ డైరెక్టర్ దొం తరబోయిన కొమ్మాలు, సముద్రాల భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## రాము తండాలో అక్షరాభ్యాసం

ఇనుగుర్తి, జూన్ 14, మేజర్ న్యూస్ (సూర్య): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇనుగుర్తి మండలం లోని రాము తండాలో శుక్రవారం రోజున స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో కొత్తగా 1వ తరగతిలోకి ప్రవేశించిన విద్యార్థులచే అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది.పిల్లలు మరియు అక్కడ సభ్యులు కలిసి చదువుల తల్లి సరస్వతి దేవికి పూజ చేసి, అనంతరం పలకల మీద అక్షరాలను దిద్దించడం జరిగింది.ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని మరియు పిల్లలకు ప్రభుత్వం మంచి సౌకర్యాలను కల్పిస్తుందని వాటిని వినియోగించుకొని గ్రామంలోని బడి ఈడు పిల్లలందరినీ మన పాఠశాలలో చేర్పించాలని కోరారు.





## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన కాంగ్రెస్ నాయకులు

చెన్నారావుపేట జూన్ 14 (సూర్య మేజర్ న్యూస్): మృతు రాలి కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన చిన్నపెల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు గుర్రం అచ్చయ్య ఆధ్వర్యం లో రూ.5 వేలు, 50 కిలోల బియ్యాన్ని ఆర్థిక సహాయంగా అందించారు. అలాగే మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గజ్జి రాజు, బండారి చందర్ రావు, అల్లి రాజ్ కుమార్, జనగాం మల్లికార్జున్, మెట్టు రమేష్, డక్క శ్రీనివాస్, గొడిశాల శ్రీనివాస్, పర్వ నరసింహస్వామి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

### వినియోగదారులు సహకరించాలి

### -కురవి మండల ఎఇ శారద



కురవి, జూన్ 14 మేజర్ న్యూస్ (సూర్య):కురవి మండలంలోని అయ్య గారిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ లో ( మెంటనెన్స్ ) మరమ్మతుల కారణం గా నేడు (శనివారం) ఉదయం 7:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అంతరాయం కలుగుతుందని, అందుకు వినియోగ దారులు సహకరించాలని కురవి మండల విద్యుత్ ఎఇ శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయ్యగారిపల్లి, మోదుగులగూడెం, నల్లెల్ల, తిరుమలాపురం, కురవితో పాటు చుట్టూ ఉన్న తండాలకు కూడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

## ప్రపంచ 20 వ రక్తదాన దినోత్సవ సందర్భంగా చేయూత సేవా సంస్థ వ్యవస్థాపకులు, చిడెం సాయి ప్రకాష్ కు ఉత్తమ సేవా అవార్డులు



వెంకటాపురం నాగూరు జూన్ 14 సూర్య మేజర్ న్యూస్: ప్రపంచ 20 వ రక్తదాన దినోత్సవం సందర్భంగా, హైదరాబాద్ లోని సంస్కృతి రాజ్ భవన్ హాల్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా తెలంగా ణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా వెంకటాపురం కేంద్రంగా చేయూత సేవా సంస్థ ఆధ్వర్యంలో అనేక రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తదానం చేసిన సంస్థ వ్యవస్థాపకులు, విద్యా వంతులు యువకుడు చిడెం సాయి ప్రకాష్ కు ఉత్తమ సేవా కు రెండు అవార్డులను అందజేశారు. తెలంగాణ స్టేట్ రెడ్ క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రా, రెడ్ క్రాస్ సెక్రెటరీ మదన్ మోహన్ ఆధ్వర్యం లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వారికి ఎక్కువ రక్తం దాన శిబిరాలు చేసిన సందర్భంగా వెంకటాపురం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థకు రెండు అవార్డులు రావడం జరిగింది. ఎక్కువ రక్తదాన శిబిరాలు పెట్టినందుకు గాను, ఎక్కువమందిని మోటివేట్ చేసి హైయెస్ట్ మోటివేషన్ అవార్డు, ఎక్కువ యూనిట్స్ ను భద్రాచలం రెడ్ క్రాస్ సొసైటీకి ఇప్పించి వందుకు గాను రెండు అవారులను తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తెలంగాణ స్టేట్ రెడ్ క్రాస్ చైర్మన్ అజయ్ మిశ్రా, రెడ్ క్రాస్ సెక్రెటరీ మదన్ మోహన్ చేతుల మీదుగా చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ కు అందజేశారు. అప్రిషియేట్ సర్టిఫికేట్స్ అందజేశారు.చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ కు అవార్డుకు కారణమై సహకరించిన ప్రతీ ఒక్కరికీ, రక్తదాత లందరికీ పేరు పేరున అవార్డు గ్రహీత సాయి ప్రకాశ్ కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమానికి తెలంగాణలోని అన్ని జిల్లాల డైరెక్టర్లు చైర్మన్లు ఎమ్మెల్యేలు హెల్త్ డైరెక్టర్లు తెలంగాణ రెడ్ క్రాస్ సభ్యులు తదితరులుపాల్గొన్నారు



# పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్

### ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లాలో ఉన్న భూముల మార్కెట్ విలువ రిపోర్ట్ సమర్పించాలి

### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన సీసీఎల్ఏ కమీషనర్



మహబూబాబాద్ ప్రతినిధి, జూన్ 14,మేజర్ న్యూస్(సూర్య): పెండింగ్ ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్  అద్వైత్ కుమార్ సింగ్, రెవెన్యూఅదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ లతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. సీసీఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించామని అన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసిల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సేషన్, పెండింగ్ మ్యూటేషన్ వంటి దరఖాస్తులను రికార్డులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి పరిష్కరించాలని అన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు.ధరణి వెబ్ సైట్ సంబంధించి జిఎల్ ఎం, టిఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసిల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నా మని అన్నారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో ప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సిసిఎల్ఏ కమీషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎక్కడా స్థానికంగా ఎటువంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం లేదా భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు.సీసీఎల్ఏ నుంచి జిల్లా కలెక్టర్లకు రిటర్న్ వచ్చిన దరఖాస్తులలో అధికంగా ఆర్.ఎస్.ఆర్ దరఖాస్తులు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు జత చేయని దరఖాస్తులు ఉంటాయని అన్నారు. ఆర్ఎస్ఆర్ దరఖాస్తులలో తప్పుడు ఎంట్రీ జరిగిందా ధ్రువీకరించి, తప్పుడు ఎంట్రీని తొలగించి , ఆర్ఎస్ఆర్ సవరణకు రిపోర్టుతో సహా దరఖాస్తులు పంపాలని కలెక్టర్లకు సీసీఎల్ ఏ కమీషనర్ సూచించారు. విడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్  అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ,  జిల్లాలో అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారుల,తహసిల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను  ప్రత్యేక కార్యాచరణ అమలు చేసి త్వరలో పరిష్కరిస్తామని అన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లాకలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ, ప్రతి మండలంలోని తహసిల్దార్ కార్యాలయంలో పెండింగ్ ధరణి దరఖాస్తులను స్కానింగ్ చేసేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసుకోవాలని, మండలం లో పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరిత గతిన పరిష్కరించేందుకు రోజువారి లక్ష్యాలను కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓ లు ఎల్.అలివేలు, నరసింహారావు కలెక్టరేట్ పర్యవేక్షకులు భద్రకాళి, రమణి, వివిధ మండలాల తహసీల్దార్ లు పాల్గొన్నారు.

---

## ప్రాథమిక పాఠశాలలో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



గణపురం జూన్ 14 మేజర్ న్యూస్ సూర్య: గణపురం ప్రాథమిక పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గోవర్ధన వేణుగోపాలచార్యులు శాస్త్రవేత్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూలం కుమార స్వామి గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగాఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్  ఎం.పి.పి విడిదినేని అశోక్  యంపిటిసి మోటపోతుల శివశంకర్ ,హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు దేసు సతీష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ  మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో గ్రామంలోని బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం పొంది తమ భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకోవాలని సూచించారు అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ తో పాటు ఉపాధ్యాయులు కందుకూరి నరసింహమూర్తి,రాచకొండ భాస్కర్,దాసరి చంద్రమౌళి, మడిపోజు శ్రీదేవి , పరికి కోమల ,అమ్మ  ఆదర్శ కమిటీ చైర్మన్ దూడపాక రజిత,లు పాల్గొన్నారు.

# కొండా ఇంట సందడి...

### స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు సీతక్క పొన్నం ప్రభాకర్ , ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లు హాజరు



వరంగల్ టౌన్, జూన్ 14 మేజర్ న్యూస్ (సూర్య) , తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ , కొండా మురళి దంపతుల  ఇంట శుక్రవారం  సందడి నెలకొంది. ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని తమ ఇంటికి వచ్చిన శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపి బలరాం నాయక్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య  తదితరులతో కొండా దంపతుల ఇంటికి వచ్చిన సందర్భంగా కొండా దంపతులు సరదాగా వారితో ముచ్చటించారు. రోజు వారి షెడ్యూలతో బిజీబిజీగా గడిపే వివిఐపిలంతా కాసేపు సేదతీరారు. తమ ఇంటికి వచ్చిన అతిథులకు కొండా దంపతులు ఎదురుగా వెళ్ళి స్వాగతం పలికారు.





# క్షయ వ్యాధి నిర్మూలనుకు కృషి చేయాలి

### -డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ మురళీధర్

### - బి.సి.జి.వాక్సిన్ గురించి అవగాహన కార్యక్రమం

మరిపెడ,జూన్ 14,మేజర్ న్యూస్(సూర్య):క్షయ వ్యాధి నిర్మూలనుకు కృషి చేయాలని డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ మురళీధర్ వైద్య సిబ్బంది కి సూచించారు. శుక్రవారం మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వయోజన బి.సి.జి.వాక్సిన్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ మురళీధర్ హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగష్టు నెలలో 18 సంవత్సరాలు పై బడిన వారికి క్షయ వ్యాధిని అంతం చేయడం కొరకు 3 నెలల పాటు వాక్సిన్ వేసే కార్యక్రమం ఉంటుందన్నారు.ఈ టీకా కొరకు ప్రతి ఆశ,ఆరోగ్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఇంటి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు.ఈ వయోజన బి.సి.జి. వాక్సిన్ తీసుకువడానికి అర్హత ప్రమాణాలు ముఖ్యం గా 60 ఏళ్ల పై బడిన వృద్ధులు,బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువగా ఉన్నవారు,స్వీయ నివేదిత షుగర్ వ్యాదిగ్రస్తులు,స్వీయ నివేదిత గతంలో పోగతాగుట,జనవరి 2021 నుండి క్రియాశీల టిబి వ్యాధిగ్రాస్తులతో



సన్నిహిత సంబంధం,గత 5 సంవత్సరాలలో టీబీ వ్యాధి సోకిన చరిత్ర కల వారికి ఈ టీకా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి,ప్రసాద్, డీప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ వనకర్ రెడ్డి, కమ్యూనిటీ మెడికల్ ఆఫీసర్ శాంత కుమారి, సూపెర్వైసోర్ సుదర్శన్, వెంకటేశ్వర్లు,శోభరాణి, పల్లె దవాఖాన డాక్టర్స్, ఏఎన్ ఎం లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు

# సరస్వతి మాత ఆలయ 6వ వార్షికోత్సవ వేడుకలు

### బ్రహ్మశ్రీ రామగిరి సోమలింగం సోమలక్ష్మి ఆచార్యులు

ధర్మసాగర్ జూన్ 14( సూర్య న్యూస్): ధర్మసాగర్ మండలం రాయగూడెం గ్రామంలో ఉన్న శ్రీ సరస్వతీ మాత ఆలయ ఆరవ వార్షికోత్సవ వేడుకలు అమ్మవారి భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని అమ్మవారి సేవకులు, వాస్తు బ్రహ్మ, బ్రహ్మశ్రీ రామగిరి సోమలింగం సోమలక్ష్మి ఆచార్యులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా రామగిరి సోమలింగం సోమలక్ష్మి మాట్లాడుతూ కళల కాణాచి.. ఓరుగల్లు మహానగరానికి సమీపంలో ఉన్న బుగులు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు వెళ్ళే దారిలో ఎందరో మహానుభావుల, శ్రేయోభిలాషుల, భక్తాభీష్ట సిద్దర్యథం, శ్రీ సరస్వతీ దేవి నాచే సంకల్పించి నిర్మించిన శ్రీ సరస్వతీ మాత ఆలయం, ఇటీవల కాలంలో భవ్యంగా..నిర్మించబడిన శ్రీ సోమ లింగేశ్వర శివాలయం భక్తజన మనోరంజకాన్ని కల్పిస్తూ.. మానసిక ప్రశాంతత కల్పిస్తూ.. సర్వ దోషాలను హరించే కల్పవల్లిగా నిత్య పూజాభిషేకాలు అందుకుంటున్న శ్రీ సరస్వతీ మాత ఆలయం ఆరవ వార్షికోత్సవం



ఈ నెల 16-06-2024, జ్యేష్ట శుద్ధ దశమి నాడు అందరి సమక్షంలో ఎంతో వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. 16 వ తేదీన ఆదివారం రోజు ఉదయం శ్రీ శారదా పరమేశ్వరికి విశేష అభిషేకాదులు, మహాపూజ,, శాంతి పూర్వక హవనాదులు, మహా అన్న



ప్రసాద వితరణలు జరుగుతున్న క్రమంలో భక్తులు అందరు విశేష సంఖ్యలో తరలి వచ్చి ఆదిశక్తి, పరాశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞాన శక్తి, క్రీయా శక్తి స్వరూపిణి అయిన శ్రీ సరస్వతీ మాత వేడుకలకు తరలి వచ్చి శ్రీ శారదా పరమేశ్వరి కృపా కరుణా కటాక్షాలకు పాత్రులు కాగలరని కోరారు.

# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

### తక్కల్లపల్లి రవీందర్ రావు

### 25 సార్లు రక్తదానం చేసిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు రాజశేఖర్

నర్సంపేట జూన్ 14 మేజర్ న్యూస్: (సూర్య): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణం లోని జిల్లా ఆసుపత్రి లో తక్కల్లపల్లి రవీందర్ రావు తో పాటు మరో 20 మంది రక్తదానం చేశారు .ఈ సంధర్భంగా రవీందర్ రావు ,మున్సిపాలిటీ ఫ్లోర్ లీటర్ వేముల సాంబయ్య గౌడ్ లు మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధాన పరిస్థితుల్లో తల సేమియా వంటి వ్యాధులతో పాటు అనేక ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోతున్న వారి కోసం 18 ఏళ్ల నుంచి 60






ఏళ్ల లోపు ఉన్న ప్రతి పౌరుడు రక్తదానం చేసి మరోకరి ప్రాణానికి దాత కావాలని అన్నారు. ఈ సందర్భంగా 25 సార్లు రక్తదానం చేసిన స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకుడు ఎర్రబోయిన రాజశేఖర్ ను కాంగ్రెస్ పార్టీ నాయకులు శాలువాతోసన్మానించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ డాక్టర్ ఐ ప్రకాష్, వరంగల్ జిల్లా వైద్య విధాన పరిషత్ అధికారి డాక్టర్ పి గోపాల్, జిల్లా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ కిషన్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ మనోజ్లాల్, ఆర్థో డాక్టర్ విరీన్, డాక్టర్ స్నేహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జయ్యారపు అఖిల్, కటారి ఉత్తమ్ కుమార్, దండెం రతన్ కుమార్,రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్తు కార్మికులంతా టీమ్ వర్క్‌తో పని చేయాలి

స్టేషన్ ఘనపూర్, జూన్ 14,మేజర్ న్యూస్(సూర్య): విద్యుత్తు శాఖ డిఈ మాలోతు హుస్సేన్ నాయక్ ఆదేశాల మేరకు స్టేషన్ ఘనపూర్ డివిజన్ పరిధిలో గల స్టేషన్ ఘనపూర్, శివునిపల్లి, రాజవరం జఫర్గఢ్,పాలకుర్తి టౌన్,రూరల్ ,కొడకండ్ల సెక్షన్ కార్యాల యాల్లో ఆయా సెక్షన్ ఏఈ లు పెప్ టాక్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా విద్యుత్తు కార్మికులంతా టీమ్ వర్క్ తో కోఆర్డినేషన్ తో పని చేయాలని చెప్పడంతో పాటు భద్రతా అంశాలకు గల ప్రాముఖ్యతను వివరించారు.ఫీడర్స్ అంతరాయాలను పర్యవేక్షించి గాలి దుమారం వల్ల కలిగే ఆటంకాలను త్వరిత గతిన పునరుద్ధరించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘనపూర్ ఏఈ పులి చంద్రమోహన్,శివునిపల్లి యు. శివకుమార్, రాజవరంటి.రమేష్,జఫర్గఢ్ కె. విశ్వసాహితి,పాలకుర్తి ఎ.రణధీర్ ,కొడకండ్ల టి.రాములు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం డిఈ మాలోతు హుస్సేన్ నాయక్

స్టేషన్ ఘనపూర్,జూన్ 14,మేజర్ న్యూస్(సూర్య): పెరుగుతున్న లోడ్ కారణంగా స్టేషన్ ఘనపూర్ 132/33 కెవి లో 2000 సంవత్సరంలో వేసిన విద్యుత్తు వైర్ల స్థానంలో 1200 ఎ బస్ కప్లర్ ఎబి స్విచ్చును అమర్చుతున్న సందర్భంగా స్టేషన్ ఘనపూర్ డివిజన్ పరిధిలో గల సబ్ స్టేషన్లు స్టేషన్ ఘనపూర్, తాటికొండ, శివునిపల్లి, ఇప్పగూడెం,నమిలిగొండ,చిల్పూర్, రాజవరం,ఫతేపూర్, మల్కాపూర్,చిన్న పెండ్యాల,తిమ్మంపేట,ఉప్పుగల్లు సబ్ స్టేషన్ల పరిధిలో నేటి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని డిఈ మాలోతు హుస్సేన్ నాయక్ శుక్రవారం తెలిపారు. కావున ఆయా పరిధిలోని రైతులు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## మున్నూరుకాపు పటేల్స్ అసోషియేషన్ నూతన జిల్లా అధ్యక్షులు కార్యదర్శులుగా నియామకం



మహబూబాబాద్, రూరల్, జూన్ 14,మేజర్ న్యూస్ (సూర్య): మానుకోట మున్నూరుకాపు పటేల్స్ అసోషియేషన్ మహబూబాబాద్ అధ్యక్ష కార్యదర్శులుగా పట్టణానికి చెందిన పిట్టల బుచ్చిరామారావు, పిట్టల శ్రీకాంత్ ఎన్నికయ్యారు. శుక్రవారం నాడు స్థానిక మున్నూరు కాపు ఉద్యోగసంఘ భవనంలో జరిగిన సంఘ సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈసందర్భంగా పిట్టల బుచ్చిరామారావు, పిట్టల శ్రీకాంత్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గా ఎన్నుకోవడంలో ముఖ్య భూమిక పోషించిన మున్నూరుకాపు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కుల అభివృద్ధికి, విద్య, వైద్య, రాజకీయ, ఉద్యోగ పదోన్నతుల్లో కాపులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతామని స్పష్టంచేశారు. సాధ్యమైనంత త్వరగా మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుచేసి కాపుల అభ్యున్నతికి పాటు పడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఎన్నికైన సభ్యులను బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు ఆధ్వర్యంలో సభ్యుల కరతాళధ్వనుల మధ్య ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు జిన్నారెడ్డి శ్రీనివాస్ తో పాటు జిల్లా కాపు నాయకులు మద్దెల రమేష్, ఆవుల కుమార్, పిట్టల చంద్రశేఖర్, బొళ్ల జగ్గయ్య, చెవ్వ చిరంజీవి మరియు సుతారపు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్**

**ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి**

**జిల్లాలో ఉన్న భూముల మార్కెట్ విలువ నివేదికను వెంటనే సమర్పించాలి**



జనగామ, మే 14, మేజర్ న్యూస్: ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, జిల్లా హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, జనగామ జిల్లాల కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ₹సీసీఎల్ఏ కమీషనర్ మాట్లాడుతూ లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కంటే ముందు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 1.38 లక్షల ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించామన్నారు. ప్రస్తుతం పెండింగ్ లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను వేగవంతంగా ప్రణాళికబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్ వంటి దరఖాస్తుల రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని, డేటా కరెక్షన్ దరఖాస్తుల్లో క్షేత్రస్థాయి విచారణ చేపట్టి, త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను సమీక్షించుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అదనపు సిబ్బందిని కేటాయించాలని ఆయన సూచించారు. ధరణి వెబ్ సైట్ కు సంబంధించి జీఎల్ఎం, టీఎం 33 దరఖాస్తులలో డిజిటల్ సంతకాల ప్రక్రియ మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసిల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి స్థాయిలో, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలోప్రతి మంగళవారం, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే భూ సంబంధిత దరఖాస్తులను ఆయా జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేయడం జరుగుతుందని, వీటిని అత్యంత ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని సీసీఎల్ఏ కమీషనర్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూముల రిజిస్ట్రేషన్ విలువ పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తుందని, దీని కోసం జిల్లాలో భూముల మార్కెట్ విలువ, ప్రస్తుత రిజిస్ట్రేషన్ విలువ వివరాలతో కూడిన నివేదికను అందించాలని, మార్కెట్ విలువ నమోదులో ఎలాంటి వివాదాలు రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు అనువైన భవనం (లేదా) భూమి కేటాయించి ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. సీసీఎల్ఏ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లకు రిటర్న్ వచ్చిన దరఖాస్తులలో అధికంగా ఆర్ఎస్ఆర్ దరఖాస్తులు, సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లు జతచేయని దరఖాస్తులు ఉంటాయని, ఆర్ఎస్ఆర్ దరఖాస్తులలో తప్పుడు ఎంట్రీలను ధ్రువీకరించి, వాటిని తొలగించి, ఆర్ఎస్ఆర్ సవరణకు నివేదికలు పంపాలని కలెక్టర్లకు సీసీఎల్ఏ కమీషనర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమావేశం నిర్వహించి, ధరణి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో అదనపు కలెక్టర్, రెవెన్యూ డివిజన్ అధికారి, తహసీల్దార్ల స్థాయిలలో పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణతో పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తుల సత్వర పరిష్కారానికి మండలాలకు అవసరమైన అదనపు సిబ్బందిని కేటాయించి, దరఖాస్తులు వేగవంతంగా పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ దరఖాస్తులను స్కానింగ్ చేసేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసుకోవాలని, మండలంలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు రోజువారి లక్ష్యాలను కేటాయించుకోవాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. ఎటువంటి నిర్లక్ష్యం తగదని, ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ దరఖాస్తుల ప్రక్రియలో సంబంధిత ఆధారిత డాక్యుమెంట్లను స్పష్టంగా అప్ లోడ్ చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్డీఓలు కొమురయ్య, వెంకన్న, ఈడీఎం దుర్గా రావు, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.



## రక్తదాతలే ప్రాణదాతలు

**జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్**



తొర్రూరు. జూన్14.మేజర్ న్యూస్( సూర్య): అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో గొప్పదానం అని అలాంటి రక్త దానం చేసిన దాతలు ప్రాణదా తలుగా నిలుస్తారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ మండల అధ్యక్షుడు కాసోజు. సాయి నాథ్ ,ఆధ్వర్యంలో రక్తదాతలకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన కళాశాల ప్రిన్సిపల్ రమేష్ మాట్లాడుతూ గత తొమ్మిది,సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ సేవలు, అభినంద నీయమని అన్నారు. సంస్థకు సహకరిస్తున్న వారిని,గుర్తించి ,ఇలాంటి ప్రోత్సాహక, కార్యక్రమాలు చేయడం సంతోష కరమన్నారు. సంస్థ ఆధ్వర్యంలో అనునిత్యం నిరుపేద విద్యార్థులకు అండగా ఉంటూ, పర్యావరణ పరిరక్షణ పై,యువతలో జాతీయ భావాన్ని పెంపొందించి, గ్రామీణ క్రీడలను ప్రోత్సాహించే కార్యక్రమాలతో పాటు అంబులెన్స్, శుద్ధిత త్రాగునీరు అందించడం, ఫ్రీజర్ తదితర సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని గుర్తు చేశారు. మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ సీనియర్ ప్రతినిధి పయ్యావుల .ప్రవీణ్ యాదవ్, ఎన్.ఎస్.ఎస్. కోర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ జాతియ నాయకుల జయంతి వేడుకల సందర్భంగా వరంగల్ ఎంజీఎం బ్లడ్ బ్యాంక్, మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ వారి ఆధ్వర్యంలో రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్త దానం చేసిన వారిని గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మియాపురం రమాకాంత్, కృష్ణ, క్రాంతి కుమార్, సురేష్ బాబు, అన్వేష్, దినేష్ తదితరులు,పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో పిల్లలకు ఉచిత వైద్య పరీక్షలు



పరకాల రూరల్ జూన్ 14 మేజర్ న్యూస్: నడి కూడ మండలం నర్సక్కపల్లె గ్రామ అంబేద్కర్ కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని ఆర్ బి ఎస్ కే టీం సందర్శించారు. అంగన్వాడీ కేంద్రంలోని బాలబాలికలకు గర్భిణీలకు ఆర్ బి ఎస్ కే టీం వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి చిన్నపిల్లలకు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని వారికి అవగాహన కల్పించారు. అదేవిధంగా పుట్టుకతో కలిగే అంగవైకల్యాలు పోషకాహార లోపంతో కలిగే ఇబ్బందులను తగ్గించుకోవడం కొరకు తగు సూచనలు ఇచ్చారు. అంగన్వాడీ సెంటర్లలో లభించే బాలామృతం పాలు గుడ్లు ఆహారమును చిన్న పిల్లలు తీసుకుంటూ అంగన్వాడి సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. గర్భిణీ బాలింతలు అంగన్వాడీ కేంద్రంలో భోజనం చేసి ఎగ్గు తిని పాలు త్రాగే సరైన పోషణతో ఉండే ఆరోగ్యవంతమైన పిల్లలకు జన్మనివ్వాలని తెలియజేశారు. చిన్నపిల్లలకు ప్రతినెల టీకాలను తప్పకుండా వేయించాలని వ్యాధి నిరోధకతను పెంచుకోవాలని తెలియజేశారు . ఈ కార్యక్రమంలో వైద్య బృందం డాక్టర్ రవీందర్. డాక్టర్ సంధ్యారాణి. కవిత. ఏఎన్ఎం. బోసు బాబు ఫార్మసిస్ట్ అంగన్వాడీ టీచర్స్ కోడెపాక సుప్రియ. ఆయా జన్ను వనజ. పిల్లలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల పంటల ప్రోత్సాహంపై అవగాహన కార్యక్రమం

ఇనుగుర్తి, జూన్ 14, మేజర్ న్యూస్ (సూర్య) : ఇనుగుర్తి మండల కేంద్రంలో జీవన ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని రైతులు మరియు గ్రామస్తులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జీవనాధార్ సొసైటీ డైరెక్టర్ సాక్రుబాయ్ మాట్లాడుతూ చిరుధాన్యాల పంటలను పండించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు, గ్రామ ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారు అదేవిధంగా జీవన్ ఆధార్ సొసైటీలో ఇప్పటివరకు చేసిన కార్యక్రమాల గురించి తెలియజేశారు. చిరుధాన్యాలు ఎప్పటి నుంచి పండిస్తున్నారు,ఇతర పంటలు వేయడం వల్ల ఎలాంటి నష్టాలు జరుగు తున్నాయి మనుషులకు ,భూమికి ఏ విధంగా నష్టం జరుగుతుందనేది చర్చించుకుంటూ పూర్వ, ప్రస్తుత పరిస్థితులను గురించి వివరించారు.గత రెండు సంవత్సరాల నుండి వీర రెడ్డి పల్లి, అయ్యగారి పల్లి గ్రామాల రైతులు చిరుధాన్యాలను పండిస్తున్నారని చెప్పారు. ఈ సదస్సులో నాగారం మరియు ఇనుగుర్తి గ్రామల రైతులు చిరుధాన్యాలను పండించడానికి ముందుకు వచ్చి విత్తనాలను కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ నుండి అన్వర్, రాము పలువురు సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జీవన ఆధార్ సొసైటీ తరపున



డాక్టర్ గౌతమ్, మోహన్, అనిల్, సురేష్ మరియు ఇనుగుర్తి మండలంలోని పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.